క్లుప్తంగా

పీఆర్‌లో బదిలీలు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్(పీఆర్)శాఖలో బదిలీలు జరిగాయి. డీఈలుగా చిత్తూరుకు నవీన్, పలమనేరుకు మహేష్, పూతలపట్టుకు అనితను నియమించారు. పీఐయూ విభాగం పూతలపట్టు డీఈగా నరసింహప్రసాద్‌ను వేశారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ డీఈలుగా చిత్తూరుకు శ్రీనివాసులు, పూతలపట్టుకు రవికిరణ్, పలమనేరుకు స్టాలిన్, నగరికి శ్రీహరి, కార్వేటినగరానికి సతీష్‌ను నియమించారు. వీరు త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి



వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

పుత్తూరు: ఉచిత వైద్య శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీకుమార్ సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తిరుపతికి చెందిన శ్రీసాయి డెంటల్ క్లినిక్ వారు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 400 మంది విద్యార్థులు, 50 మంది సిబ్బంది దంత పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్లు హరిత, పృథ్వీరాజ్, శిఖర్‌సాయి వైద్య సేవలందించారు.

ఇళ్ల నిర్మాణాలు పునఃప్రారంభించండి



గ్రామసభలో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ

విజయపురం: ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన జగనన్న ఇళ్ల నిర్మాణాలను పునఃప్రారంభించాలని ఈవోపీఆర్‌డీ సురేంద్రకుమార్ తెలిపారు. మండల కేంద్రం విజయపురం ఆదిఆంధ్రవాడలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించాలని, వాటికి అవసరమైన రుణం డ్వాక్రా సంఘాల ద్వారా అందిస్తామన్నారు. సిమెంట్, ఇసుక, కమ్మీలు కూడా ఇస్తామని, త్వరలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.

పీఈటీ తిరుమలరాజుకు ఘన సన్మానం



పీఈటీ తిరుమలరాజుకు కేక్ తినిపిస్తున్న హెచ్‌ఎం కేశవులు

కార్వేటినగరం: మండలంలోని డీఎం పురం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు పీఈటీ తిరుమలరాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కేశవులు మాట్లాడుతూ డీఎం పురం ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తూ అనేక మంది క్రీడాకారులను జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో రాణించేలా తీర్చిదిద్దిన ఘనత తిరుమలరాజుకి దక్కుతుందని తెలిపారు. క్రమశిక్షణకు మారు పేరుగా నిలుస్తూ విద్యార్థులకు తనదైన శైలిలో క్రీడల్లో శిక్షణ ఇచ్చారని గుర్తు చేశారు. తిరుమలరాజు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. 150 మంది విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు త్యాగరాజు, చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్

కార్వేటినగరం: జీడీనెల్లూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. త్వరలో నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. చెంగల్రాయులు యాదవ్, పొన్న యుగంధర్, నాగేశ్వరరాజు, జనార్దన్ రాజు, రవియాదవ్, దివ్య, చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులు ధరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని ఎగువ రాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం దాత బాలకృష్ణ క్రీడాదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అపారమైన క్రీడా ప్రతిభదాగి ఉందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను ప్రోత్సహించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. దాత బాలకృష్ణను హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో నాగరాజనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇదేనా.. మంచి ప్రభుత్వం

గద్దెనెక్కడమే లక్ష్యంగా టీడీపీ అలవికాని హామీలు గుప్పించింది. ప్రజలను మభ్య పెట్టడంలో విజయం సాధించింది. తీరా గద్దెనెక్కాక అధికార పార్టీ నేతలు తమ విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. ఆదిలోనే వైఎస్సార్ సీపీకి సంబంధించిన శిలాఫలకాలు, స్థూపాలు, బోర్డులు ధ్వంసంచేస్తూ పరిపాలనను ప్రారంభించారు. ఆపై విచ్చలవిడిగా దోచుకోవడం మొదలు పెట్టారు. రాత్రీపగలు తేడా లేకుండా ఖనిజ సంపదను దోచేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కారు. చేసిందంతా చేసి ఇది మంచి ప్రభుత్వం అంటూ సందుల్లో సమావేశాలు పెట్టి చెబుతుంటే అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- విచ్చలవిడిగా గ్రావెల్, ఇసుక దోపిడీ
- రెక్కలు విప్పిన పచ్చ దందా
- ఖనిజ సంపదకు భద్రత కరువు





పరమేశ్వర మంగళం వద్ద గ్రావెల్ తవ్వకాలు, పరమేశ్వరమంగళం వద్ద రాత్రిపూట గ్రావెల్ ట్రాక్టర్

సాక్షి టాస్క్‌ఫోర్స్: నియోజకవర్గంలోని అధికార పార్టీ నేతలకు ఇసుక, గ్రావెల్, చెరువు మట్టి, కంకర ప్రధాన ఆర్థిక వనరులుగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన అభివృద్ధి ఆనవాళ్లను ధ్వంసం చేయడంలో అత్యంత చొరవ చూపారు. ప్రస్తుతం ఇసుక, గ్రావెల్‌పై అధికార పార్టీ నేతలు కన్నేశారు. పక్కా ప్రణాళిక ప్రకారం దోచుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. తమకు అనుకూలమైన అధికారులను నియమించుకుని నామమాత్రపు అనుమతులతో అడ్డగోలుగా చెలరేగుతున్నారు. అడ్డూఅదుపు లేకుండా విచ్చలవిడిగా ఇసుక, గ్రావెల్ దోపిడీతో చక్రం తిప్పుతున్నారు.

క్వారీలు కల్పవృక్షాలు

క్వారీలు టీడీపీ నేతలకు కల్పవృక్షాలుగా మారిపోయాయి. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి పూట జేసీబీలు పెట్టి ఇసుక, గ్రావెల్‌ను తమిళనాడుకు తరలించేస్తున్నారు. పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం, నగరి మండలం గుండ్రాజకుప్పంలలో రాత్రి పూట గ్రావెల్, కంకర దోచేస్తున్నారు. కుశస్థలి నదిలోనూ రాత్రిళ్ల ఇసుకను తరలించేస్తున్నారు. విజయపురం మండలం పాతార్కాడు గ్రామంలో 64 ఎకరాలున్న పశుమేత పచ్చిక భూమిలో గ్రావెల్ తరలించేందుకు టీడీపీ నాయకులు పథక రచన చేస్తున్నారు. దీనికి గ్రామ సభల్లో అనుమతులు కోరగా గ్రామ ప్రజలు, కొందరు మాత్రం అధికార పార్టీకి చెందిన వారు నిరాకరించారు. అయినా అధికారులపై ఒత్తిడి తెచ్చి గ్రావెల్ తరలించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. చివరకు చెరువు మట్టిని కూడా వదలడం లేదు. ప్రతి మండలంలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. మరోవైపు సూపర్ సిక్స్ హామీలు, నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు పట్టాలు ఎక్కలేదు. వలంటీర్లు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసేవారికి ఉద్యోగాలు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ దశలో ఇది మంచి ప్రభుత్వం అంటూ అధికార పార్టీ చేపడుతున్న కార్యక్రమంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత పాలనలో ఖనిజ సంపదపై ఊకదంపుడు ప్రసంగాలు ఇచ్చిన ప్రస్తుత అధికార పార్టీ నేతలు అధికారంలోకి రాగానే దోపిడీకి బరితెగించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.







గుండ్రాజుకుప్పం వద్ద రాత్రి పూట గ్రావెల్ తవ్వుతున్న జేసీబీ యంత్రాలు, కుశస్థలి నదిలో నుంచి అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

వరండాలో అంగన్‌వాడీ కేంద్రం



కర్వరవేడులో వరండాలో అంగన్‌వాడీ పిల్లలు

నింద్ర: మండలంలోని కర్వరవేడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల భవనం వరండాలో పిల్లలు, బాలింతలు, గర్భిణులు గడపాల్సి వస్తోంది. గతంలో పాఠశాల ఆవరణలోని పాఠశాల గదిలో అంగన్ వాడీ కేంద్రం నడిచేది. 2019లో ఈ కేంద్రాన్ని అక్కడ నుండి బయటకు పంపేశారు. దీంతో గ్రామంలోని ఓ దాత తన ఇంటిలోని ఒక గదిని అంగన్ వాడీకి కేంద్రానికి కేటాయించారు. అలా మూడు సంవత్సరాలు గడిచాయి. తరువాత ఆ దాత ఇంటిని పగలగొట్టి నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీంతో అంగన్‌వాడీ కేంద్రానికి గదిలేక పాఠశాల ఆవరణలోకి మారింది. 2019లో అంగన్‌వాడీ కేంద్రం సొంత భవనం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయయి. భవన నిర్మాణం ప్రారంభించిన కొన్ని నెలలకే ఎన్నికలు రావడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండాల్సిన పిల్లలు వరండాలో గడుపుతున్నారు. దీంతో తల్లిదండ్రులు కొత్త భవనం కోసం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీకి కొత్త భవనం కేటాయించాలని కోరుతున్నారు.

దేశభక్తికి ప్రతిరూపం ఎన్‌సీసీ



ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య

పుత్తూరు: దేశభక్తికి ప్రతిరూపమే నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) అని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య అన్నారు. గురువారం ఎన్‌సీసీలో ప్రవేశం పొందిన 34 మంది విద్యార్థులు ఆయన అభినందించి మాట్లాడారు. శిక్షణ పొందిన విద్యార్థులు బహుళ ప్రయోజనాలు పొందేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఎన్‌సీసీ ద్వారా సామాజిక సేవ, జాతీయభావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని చెప్పారు. అలాగే శారీరక దృఢత్వం, ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉంటాయని, తద్వారా లబ్ధి పొందవచ్చునన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, పోలీస్ శాఖల్లో అధిక ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ ఎం.శ్రీనివాసులు, 29 ఆంధ్ర బెటాలియన్ తిరుపతికి చెందిన సుబేదార్ బిమల్ మింజ్, హవల్దార్ శివరాజ్, తెలుగు అధ్యాపకుడు వెంకటేశన్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు వేపంజేరి విద్యార్థులు



విజేతలైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు జయచంద్ర

గంగాధరనెల్లూరు: జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలకు వేపంజేరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు జయచంద్ర తెలిపారు. ఈ నెల 25వ తేదీ శ్రీరంగరాజపురం మండల కేంద్రంలోని హైస్కూల్లో నిర్వహించిన నియోజకవర్గం పోటీలలో అండర్-17 బాల బాలికల విభాగంలో షాట్‌పుట్‌లో పి.జయశ్రీ ప్రథమ బహుమతి, డిస్కత్రోలో అనూష రెడ్డి ద్వితీయ బహుమతి, హరికృష్ణ ద్వితీయ బహుమతి పొందారని తెలిపారు. అండర్-14 విభాగంలో డిస్కత్రోలో కె.శైలజ ప్రథమ బహుమతి, జోత్స్న షార్ట్‌పుట్‌లో ప్రథమ బహుమతి పొందగా, లాంగ్ జంప్‌లో ద్వితీయ బహుమతి పొందిందని తెలిపారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

డీసీసీ బ్యాంకు సేవలు వినియోగించుకోండి



డీసీసీ బ్యాంకు సేవలను వివరిస్తున్న మేనేజర్ మహేష్

గంగాధరనెల్లూరు: డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని, బ్యాంకులో సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై 8.3 శాతం వడ్డీ ఇస్తున్నట్లు డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని దుకాణదారులకు బ్యాంకుల్లో అందిస్తున్న సేవలను వివరిస్తూ, సాధారణ డిపాజిట్లుపై 7.8 శాతం వడ్డీని అందజేస్తున్నామన్నారు. తమ బ్రాంచ్‌లో అతి తక్కువ అద్దెతో లాకర్ వసతి ఉందన్నారు. ప్రోసెసింగ్ డాక్యుమెంటేషన్ ఇతర చార్జీల భారం పూర్తిగా లేదన్నారు. బంగారం కుదువ పెట్టుకుని రుణాలు అందిస్తున్నామని, పట్టాదారు పాస్‌బుక్‌లో ఉన్న రైతులకు రైతు రుణాలు కూడా ఇస్తామన్నారు. డ్వాక్రా సంఘాలు సకాలంలోనే రుణాలు ఇస్తామని తెలిపారు. ఫోన్ పే, గూగుల్ పే తదితర యాప్స్‌లో కూడా తమ బ్యాంకు సేవలందిస్తోందని తెలిపారు.

ఏఎస్ఐలుగా బాధ్యతల స్వీకరణ



ఏఎస్ఐ లక్ష్మి



రవి

పాలసముద్రం: పోలీస్ స్టేషన్‌కి ఏఎస్ఐలుగా వచ్చిన లక్ష్మి, రవి గురువారం బాధ్యతలు స్వీరు. ఐరాల మండలంలో పని చేస్తున్న ఎంపీఎస్ లక్ష్మి, నగరి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న రవి సాధారణ బదిలీల్లో భాగంగా పాలసముద్రం పోలీస్ స్టేషన్‌కి ఏఎస్ఐలుగా వచ్చారు. ఏఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం లక్ష్మి, రవి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి ఎస్ఐ భారతి సారథ్యంలో కృషి చేస్తామని తెలిపారు.

డీటీగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



కె.నాగరాజు

తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా కె.నాగరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయపురం మండలం నుంచి బదిలీపై పాలసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా వచ్చారు. ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

జిల్లా స్థాయిలో రాణించాలి



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



కబడ్డీ ఆడుతున్న బాలికలు

పుత్తూరు: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఎంఈఓ తిరుమలరాజు సూచించారు. గురువారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 బాల బాలికలకు నగరి నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుబ్రమణ్యం, పాఠశాల హెచ్‌ఎం సునీత, నియోజకవర్గ కోఆర్డినేటర్ గుర్రప్ప, మండలాల కోఆర్డినేటర్లు నందకుమార్, మణి, జయదేవ్, సుబ్రమణ్యం, కేశవులు, చంద్రశేఖర్‌రాజు, గోపి, పీడీలు మోహన్, సరేష్‌బాబు, లక్ష్మీపతి, షంషుద్దీన్, అరుణ, సునీత, వహీదాబేగం, బాబు, చంద్ర, పాండ్యా, కవిత, సుజాత, ముని పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మజ

పుత్తూరు: సమతుల పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సీడీపీఓ పద్మజ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన వడమాలపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. పద్మజ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ తీసుకొనే ఆహారంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభించిన పోషకాహార మాసోత్సవాలు ఈ నెలాఖరు వరకు ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రోజారమణి, ఏఎన్ఎం జ్యోతి, ఆశా చంద్రకళ, బీపీఏ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకు సిద్ధమైన నారు



రైతాంగం బిజీబిజీ

విజయపురం: రబీ సీజన్ వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఓ పక్క వరి నారు పోస్తుండగా, మరో పక్క వరి నాట్లు వేస్తున్నారు. మరి కొన్ని చోట్ల పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేస్తున్నారు. విజయపురం మండలంలో మాధవరం, జగన్నాథపురం, పన్నూరు, గంగమాంబపురం, కేవీపురంలో రైతులు వరి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.



దుక్కి దున్నుతున్న రైతు

కొత్త పింఛన్లు కలేనా?

- పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- జగన్ ప్రభుత్వంలో అడిగిన వెంటనే పింఛన్
- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్
- ఉన్న పింఛన్లు తొలగించేందుకు ప్రయత్నాలు



విజయపురం ఎంపీడీవో కార్యాలయం

విజయపురం: ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా... ఇంత వరకు కొత్త పింఛన్లు ఇవ్వలేదు. ఇంతలోనే ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తుండడం హాస్యాస్పదంగా మారింది.

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపు

విజయపురం మండలంలో అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. విజయపురం మండలంలో మొత్తం 25 పంచాయతీలు, 12 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వస్తున్నారు. అయితే ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులైన వారు నిరాశతో తిరిగి వెళ్లుతున్నారు. కొత్త పింఛన్ ఎప్పుడు ఇస్తారో కూడా తెలియడం లేదని సచివాలయ సిబ్బంది సమాధానం చెబుతున్నారు. అలాగే కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లినా పైసమాధానమే వస్తోంది.

గత ప్రభుత్వంలో...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం సైట్ నిలిపివేశారు. కొత్త పింఛన్, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక అర్హులైన వారు ఇబ్బంది పడుతున్నారు.

వంద రోజులైనా తెరుచుకోని సైట్

ఎన్నికల నోటిఫికేషన్ తరువాత ఆగిన సైట్, కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులైనా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పలేక తప్పించుకుని తిరుగుతున్నారు. మరి కొంత మంది ఏదో ఒక సమాధానం చెప్పి పంపివేస్తున్నారు. పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్నవారు కొత్తరేషన్ కార్డుల కోసం ఎప్పుడు సైట్ ప్రారంభిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

పింఛన్లు తొలగించే కుట్ర

కొత్త పింఛన్ మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లను ఎలాగైనా తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. అధికారం వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా 1వ తారీఖు వైఎస్సార్ సీపీ సానుభూతి పరులకు పింఛన్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. మండల స్థాయి అధికారులను బెదిరించి, పింఛన్‌లను తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త పింఛన్ కోసం ప్రజలు ఎదురుచూస్తుంటే, ఉన్న పింఛన్‌లను తొలగించడానికి అధికార పార్టీ నాయకులు ప్రయత్నం చేయడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

మొగిలి ఊరగుట్టను సర్వే చేయండి



మొగిలిలో ఊరగుట్ట భూమిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఊరగుట్ట భూమిని రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మొగిలి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 61లోని ఊరగుట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీపీఎం నాయకుడు సుబ్బారావు మాట్లాడుతూ ఊరగుట్టలో 59 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అందులో మొగిలి గ్రామానికి చెందిన 50 యానాది కుటుంబాలు ఏళ్ల తరబడి గొర్రెలు, మేకలు మేపుకుంటూ అక్కడ పండే ఫలసాయాలను విక్రయించుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఆ భూమిలో యానాదులు కొంత భాగాన్ని శ్మశానంగా ఉపయోగించుకుంటున్నారని, అయితే అదే గ్రామానికి చెందిన ఓ అగ్ర కులానికి చెందిన వ్యక్తి రెవెన్యూ అధికారులతో కలసి ఆక్రమించుకుని పట్టా చేసుకుని, గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఊరగుట్టలో ఆక్రమణలను నియంత్రించి ఎస్టీలకు న్యాయం చేయాలని గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు సీపీఎం విన్నవించినట్లు తెలిపారు. దాంతో డిప్యూటీ కలెక్టర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారని, కానీ స్థానిక రెవెన్యూ అధికారులు మాత్రం అక్రమార్కులకు వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు ఊరగుట్ట భూమిని సమగ్ర సర్వే చేసి కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాడా గంగరాజు, నాయకులు మురళి, ఓబుల్‌రాజు, వినోద్, గోపి, మంజు, యానాది సంఘ నాయకురాలు సావిత్రమ్మ పాల్గొన్నారు.